ఏళ్లతర్వాత
కలసిన ప్రేయసి
అతనికి మిగిల్చిన
అనుభవం?

# ప్రేమా నమస్కారం

కె.బి.కృష్ణ
కథ

ఫాల్గుణమాసం. సాయంత్రం ఆరు దాటుతోంది. ఆకాశం అంతా అరుణిమ దాల్చుకుని, వింత కాంతులీనుతోంది. పక్షులు గూటికి చేరుకుంటూ వింత ధ్వనులు చేస్తున్నాయి.

సముద్రం ప్రశాంతంగా వున్నట్లుగా వున్నా, అప్పుడప్పుడు కెరటాలు ఉవ్వెత్తున ఒడ్డుకు వచ్చి మళ్లీ వెనక్కి వెళ్లిపోతున్నాయి.

సముద్రానికి కొంచెం దూరంలో

కిరణ్, శాంతి కూర్చుని వున్నారు.

ఉన్నఫళంగా కిరణ్ లేచి సముద్రంవేపు పరుగులెత్తసాగాడు.

''హాయ్. ఏమిటిది. ఎక్కడికి?''

అది శాంతి.

''సూర్యుణ్ణి కొంచెంసేపు ఆగమని చెప్తామని ఎందుకంటే సాయం సమయపు వెలుగు వెన్నెలలో వింతకాంతిలో నువ్వు ఈ వయసులోకూడా ఎంతో అందంగా కనిపిస్తున్నావ్. కవ్విస్తున్నావు. సూర్యుడు వెళ్లిపోతే, మళ్లీ రేపు నిన్ను ఇలా చూడలేనేమోనని, సూర్యుణ్ణి వెళ్లద్దని రిక్వెస్ట్ చేద్దామని వెళ్తున్నాను. నన్ను ఆపేశావేం?''

''చాల్లే. పెద్ద జోకేశావుగాని. రా దగ్గరగా కూర్చో'' అంది శాంతి.

''కిరణ్ నిన్ను ఒక ప్రశ్న వేస్తాను. సమాధానం చెప్తావా?''

''ప్రశ్నకు ప్రశ్న సమాధానం కాదనుకో. అయినా ఎప్పుడూ లేనిధైర్యంతో ఒక రిక్వెస్ట్. నీ ఒడిలో తలపెట్టుకోనా శాంతీ''

శాంతి వెంటనే కిరణ్ జుట్టు పట్టుకుని తన ఒడిలో పెట్టుకుంది కిరణ్ తలని.

కిరణ్ శాంతి ముఖంలోకి పరిశీలనగా



చూశాడు.

శాంతి -

తన కాలేజీ లైఫ్‌లో -

తన స్వప్నసుందరి!

శాంతి గులాబీరంగు పంజాబీ డ్రెస్ వేసుకుని పైన ఎర్రని చున్నీ వేసుకుని వచ్చిందంటే ఆ రోజు తనకు పిచ్చెక్కిపోయేది. శాంతి ఆ రోజున కాలేజీలో ప్రవేశించిన దగ్గరనుండి

వెళ్లిపోయేవరకూ అడుగులో అడుగు వేసుకుని తిరిగేవాడు.

అదే శాంతి -

ఒక్కో రోజు ఎర్రని పట్టులంగా కట్టుకుని, తెల్లని వోణీ వేసుకుని వచ్చిందంటే ఇక క్లాసులో అందరి మతి పోయేది.

కుందనపు బొమ్మలాంటి శాంతి, విరిసిన ముద్దబంతి పూవులా వుండేది.

గులాబీరేకుల మెత్తదనం ఆమె బుగ్గలలోనూ

పాలమీగడ మృదుత్వం ఆచ్ఛాదనలేని ఆమె పొట్టమీదనూ -

మగాళ్లను సమ్మోహనపరిచే వింతకాంతి ఆమె కళ్లల్లోనూ -

అమ్మాయి అంటే ఇలా వుండాలి అని చెప్పిన బాపు బొమ్మలాగా -

అన్ని అవయవాల్లోనూ పుష్టిదనం కనిపించే ఆమె అవయవ సంపద, కాలేజీ చదువు ఇలాంటి అందాలని చూడడానికి కూడా ఉపయోగపడిందే అని కుర్రాళ్లు అందరూ సంబరపడేవారు.

తను శాంతిని మూగగా ఆరాధించేవాడు.

శాంతి ఏ కారణం చేతనైనా కాలేజీకి రాకపోతే, ఆరోజు తనకు నవనాడులూ కృంగిపోయినట్లుండేది. అన్యమనస్కంగా, తన గుండెలను ఎవరో ఎత్తుకుపోయినట్లుగా గుండెజబ్బు పేషెంట్‌లాగా వుండేవాడు.

''శాంతి రాలేదు. మనోడు ఔట్. ఆక్సిజన్ లేనట్లు అయిపోయేడు'' అని తన ఫ్రెండ్స్ ఎగతాళి చేసేవారు.

కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం ఆ వారంతో అయిపోతుంది.

వచ్చేవారం శాంతిని చూడగలనో లేదో అందుకు-

శాంతి తన స్నేహితులతో కాలేజీకి వస్తుంటే మంచి పోజు చూసి, ముందునుండి, వెనుకనుండి ఫోటోలు తీశాడు.

నవ్వుతూ కోపంగా చూసింది.

పోనీలే అనుకున్నాడు.

మర్నాడు -

పోలీసులు వచ్చారు.

తనని ప్రిన్సిపల్ రూమ్‌కి పిలిచారు. ఆడపిల్లలనికూడా పిలిచారు.

శాంతితో వుండే స్నేహితులు, పోలీసులకు చెప్పారుట.

తను ఏదో చుట్టుప్రక్కల ప్రదేశాలు అందాలు ఫోటో తీశాడని, వాళ్లను తియ్యలేదని అందమైన అబద్ధం చెప్పి, తనవేపు ఓరగా చూసింది.

'థాంక్యూ' అన్నట్లుగా అభినందనపూర్వకంగా శాంతిని చూశాడు.

పోలీసులు చివాట్లు పెట్టి వెళ్లిపొమ్మన్నారు తనని.

''ఐ లవ్ యూ'' ఎదురుపడి చెప్పలేని వెధవకు ప్రేమ, ఆకర్షణకు లోబడడంలాంటి చెడ్డ అలవాట్లు వద్దని స్నేహితులు చెప్పారు.

''అవును నేను'' శాంతి వొడిలో గొణుక్కుంటున్నాడు కిరణ్.

''ఏమిటి కిరణ్?''

''కాలేజీలో ఫోటోల సీను గుర్తుకు వచ్చింది''

''యూ సిల్లీ ఫెలో''

''శాంతీ నీ కళ్లలో నా నీడ ఇంకా కనిపిస్తోంది. నేను ఇంకా నీ కళ్లల్లో వున్నానుకదూ''

''అవునోయ్. నీకో ప్రశ్న వేస్తాను సూటిగా సమాధానం చెప్పగలవూ''

''ప్రయత్నిస్తాను''

''ఆరోజు రాజమండ్రిలో మా కుటుంబంతో మద్రాసు వెళ్లిపోతుంటే, మా ఇంటికి ఎందుకు వచ్చావు?''

''నేను నిన్ను ఎంతో ప్రేమిస్తున్నానని, ఇంకా ఏవేవో చెప్పాలని వచ్చాను''

''ఎందుకు చెప్పలేదు?''

''ఎందుకు చెప్పలేకపోయాను''

''పూర్ ఫెలో. నువ్వు చెప్పకపోవడమే మంచిదయింది. ఒకవేళ నువ్వు చెప్పివుంటే, నిన్ను కట్టుకుని స్టేట్ గవర్నమెంట్‌లో సాధారణ గెజిటెడ్ అధికారి భార్యగా వుండిపోయేదాన్ని. కానీ ఈరోజు చూడు దుబాయ్‌లో లీడింగ్ డాక్టర్ని - కాని...'' శాంతి ఆగిపోయింది.

''ఆగిపోయావేం చెప్పు''

''కాని...'' శాంతి కళ్లలోంచి నీళ్లు వచ్చి కిరణ్ కళ్లలో పడ్డాయి వెచ్చగా.

శాంతి దుబాయ్ వెళ్లింది - ఎంతో ఎత్తుకి ఎదిగింది. కీర్తి శిఖరాలు అధిరోహించింది. కాని జీవితంలో తోడులేనిది అయిపోయింది.

అందరు మగాళ్లూ దుబాయ్‌లో శాంతి సిరిసంపదలూ, ప్రేమ ప్రఖ్యాతులూ పంచుకుందామని చూశారేగాని, శాంతి హృదయాన్ని కోరుకునేవారు ఎవరూ ఆమెకు దొరకలేదు జీవితంలో.

దుబాయ్‌నుండి శెలవుల్లో వచ్చి కిరణ్‌కి ఫోన్ చేసింది సముద్రతీరానికి రమ్మని.

వచ్చాడు. ఇద్దరూ ఇప్పుడు కలుసుకున్నారు. మనసారా మాట్లాడుకున్నారు.

మధ్యవయసులో వున్న ఇద్దరూ-

కిరణ్ పిల్లల తండ్రి అయ్యాడు.

శాంతి అలాగే వుండిపోయింది.

అయినాసరే...

తెల్లని శాంతి అస్తమించే సూర్యుని వెలుగులో వెలిగిపోతోంది.

''శాంతీ నా కళ్లు మండిపోతున్నాయి. నీ కన్నీళ్లు చాలా వేడిగా మరిగిపోతున్నాయి''

''జ్వలించే హృదయంలోంచి వచ్చిన కన్నీళ్లు



ఎలా వుంటాయి?''

''నోమేడమ్''

''సిల్లీ ఫెలో'' అంటూ అతని ముఖంమీదకు తన ముఖంపెట్టి సున్నితంగా ముద్దాడింది ఆమె.

''శాంతీ నాది ఒక రిక్వెస్ట్. చెప్పనా''

''ఛీ. నాకు రిక్వెస్ట్లంటే చిరాకు. కమాండింగ్ అంటే ఇష్టం. చెప్పు''

''నాకు ఈ ప్రపంచం, ఈ దేశం వదిలి నీకూడా వచ్చేయాలని వుంది. దుబాయ్ తీసుకెళ్ళిపోతావా నన్ను''

''అలాగే-''

''నిజంగా''

''అమ్మో నా డ్రీమ్ గరల్ దుబాయ్‌లో నన్ను కరుణిస్తుందన్నమాట''

''స్లో డవున్ మైడియర్. రాత్రికి తీయని కలల్లో నిద్రపోయి, రేపు ఉదయమే సూట్‌కేస్‌తో మా ఇంటికి వచ్చేయి. మద్రాసు వెళ్ళిపోదాం''

ఈసారి కిరణ్ వంతు అయింది. శాంతిని తనకు ఇష్టంవచ్చినచోట్ల ముద్దాడేడు. అంతులేని ముద్దులు. ఆమె ''నా జన్మకు ఇదిచాలు'' అంటూ కళ్ళుమూసుకుంది తన్మయంతో. ఈ సరససల్లాపాలు చూస్తే ఏం బావుంటుందని సూర్యుడు చాటుకు వెళ్ళిపోయాడు. శాంతి, కిరణ్‌లు ఇంకా దగ్గరయ్యారు.

మర్నాడు-

పెద్ద సూట్‌కేసుతో - ఇంట్లో పెళ్ళాం పిల్లలకు చెప్పకుండా శాంతి ఇంటిదగ్గర కిరణ్ -

''అమ్మగారు ఈ చీటీ మీవరికి ఇవ్వమన్నారు''ని అటెండర్ చీటీ ఇచ్చాడు.

అందులో

''కిరణ్-

డియర్ కిరణ్

నువ్వు ఎక్కాల్సిన రైలు జీవితకాలం లేటు. మరో జన్మంటూ వుంటే, వచ్చేజన్మలో కలుసుకుందాం. నువ్వు బీచ్‌లో నాకు ప్రసాదించిన అనుభవంతో మిగిలిన జీవితం లాగించేస్తాను-

సెలవా మరి-

నీ శాంతి''

కిరణ్ కళ్లనిండా నీళ్లునిండిపోయి, ఆ చీటీలోని అక్షరాలు కదిలిపోయి కన్నీటితో నిండిన శాంతి ముఖం కనిపిస్తోంది. ★

